క్లుప్తంగా

ముగిసిన సువార్త మహాసభలు



వేమగిరిలో జరిగిన క్రైస్తవ సువార్త సభలో పాల్గొన్న ప్రముఖులు

కడియం: పెంతెకోస్తు ప్రార్థన మందిరం 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వేమగిరితోటలో మూడు రోజుల పాటు జరిగిన సువార్త మహాసభలు గురువారం రాత్రి ఘనంగా ముగిశాయి. సంఘ కాపరి పి.ప్రసాద్ ఆధ్వర్యంలో యేసయ్య సువార్త సభలు నిర్వహించారు. దైవజనులు షేక్‌ప్రభుకిరణ్, డి.ప్రసాద్, పి.జేమ్స్, పందు డేవిడ్‌రాజు, జి.సమయేలు, పవిత్ర క్రీస్తు సందేశాలను అందించారు. పి.సత్యప్రసాద్, సత్య సువర్ణ దంపతుల సందేశాలు, క్రైస్తవ గీతాలు ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డా.గోరంట్ల రవికిరణ్ పాల్గొని, చెల్లుబోయిన శ్రీనివాస్ సమకూర్చిన దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దైవ జనులు చెల్లుబోయిన మణికృష్ణ (బాబి), వాసంశెట్టి నాగబాబు, గుత్తుల ముత్యం, గుత్తుల శేషగిరి, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, జోగి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలనూ ఆకట్టుకునే చిత్రం



సమావేశంలో మాట్లాడుతున్న హీరో అశోక్ గల్లా, చిత్రంలో దర్శకుడు అర్జున్ జంధ్యాల తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా 'దేవకీ నందన వాసుదేవ' సినిమా వినూత్నంగా ఉంటుందని చిత్ర హీరో అశోక్ గల్లా, దర్శకుడు అర్జున్ జంధ్యాల, నిర్మాత బాలకృష్ణ సోమినేని వెల్లడించారు. ప్రశాంత్ వర్మ అందించిన కథతో అశోక్ గల్లా కథానాయకుడిగా, మానస వారణాసి హీరోయిన్‌గా ఈ సినిమా నిర్మిస్తున్నారు. శుక్రవారం నాడిక్కడ మీడియా సమావేశంలో హీరో అశోక్ గల్లా మాట్లాడుతూ సూపర్ స్టార్ కృష్ణ ఆశీస్సులతో, ఆయన పుట్టినరోజున రాజమహేంద్రవరంలో పాటను విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియా మాట్లాడుతూ ఈ ప్రాంతంలోనే ఉపాధ్యాయునిగా పనిచేసిన తాను సంగీత దర్శకుడిగా ఇక్కడ పాటను విడుదల చేయడం సంతోషంగా ఉందంటూ, పాటను పాడి అలరించారు. స్థానిక శివజ్యోతి థియేటర్‌లో జైకృష్ణ.. జైబోలో కృష్ణ.. పాటను విడుదల చేశారు. అనంతరం వింటేజ్ క్రియేషన్స్ మోహన్ హీరో అశోక్ గల్లాను సత్కరించారు. కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరరెడ్డిని సత్కరించిన డాక్టర్ గూడూరి



డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డికి బ్రిటిష్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ క్వీన్ మేరీ వారు డాక్టరేట్‌తో గౌరవించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాల కార్యాలయంలో విశ్వేశ్వరరెడ్డిని కలసిన ఆయన పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో సేవ చేసిన విశ్వేశ్వరరెడ్డికి డాక్టరేట్ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈయన వెంట పార్టీ లీగల్‌సెల్ స్టేట్ సెక్రటరీ గూడూరి రాధిక ఉన్నారు.

సినిమాలు

శ్యామల	: గంగం గణేశా
సూర్యమినీ	: మిస్టర్ అండ్ మిసెస్ మహి
సూర్య ప్యాలెస్	: భజే వాయువేగం
స్వామి	: భజే వాయువేగం
శివజ్యోతి	: లమ్మీ
అనుశ్రీ	: హిట్ లిస్ట్
రాజా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
ఊర్వశి	: ఆ ఒక్కటీ అడక్కు
రంభ	: రాజు యాదవ్
మేనక	: బాక్
అప్సర	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
నామవరం	
వీఎస్ మహల్	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కడియం	
వెంకటసూర్య	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, భజే వాయువేగం

ఎండను తట్టుకునేదెట్టా..?

- బయటకు రావడానికి జంకుతున్న జనం
- జ్యూస్‌లు, శీతల పానీయాలే దిక్కు!

ప్రకాశం నగర్: భానుడి మహోగ్ర రూపానికి జనం అల్లాడుతున్నారు. రోహిణీ కార్తె ప్రభావంతో వారం రోజులుగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో, నగరవాసులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఎండ తీవ్రత నుంచి తమను తాము కాపాడుకునేందుకు రక్షణ చర్యలపై దృష్టి సారిస్తున్నారు. ఎండ వేళ ఇంటి పట్టునే ఉండడం, అత్యవసర పనులకు బయటకు రావాల్సి వస్తే, జ్యూస్‌లు, బటర్‌మిల్క్, చల్లటి పానీయాలు, కొబ్బరి బోండాలు వంటివి సేవిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో, వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే వై.జంక్షన్, హైటెక్ బస్టాండ్, నందం గనిరాజు జంక్షన్, దానవాయిపేట వంటి ప్రాంతాలు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించాయి. ముఖ్యంగా రోజువారీ కూలీ చేసుకునే వారు ఎండ వేడిని తట్టుకోలేక చెట్ల కింద సేద తీరడం కనిపించింది.

ఎండ తీవ్రత నేపథ్యంలో నగరంలో పలుచోట్ల స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు, వ్యాపార సంస్థల వారు ప్రధాన సెంటర్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రజలకు తాగునీరు, మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. వీటితో పాటు జనం ఎండ వేడిమి తట్టుకునేందుకు కొబ్బరి బోండాలు, కూల్ డ్రింకులు, సోడాలు, పండ్ల జ్యూస్‌లను తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో శీతల పానీయాలకు డిమాండ్ పెరిగింది. ఇక రాజమహేంద్రవరంలో అత్యంత ప్రాచుర్యం పొందిన రోజ్‌మిల్క్, కోవా, సేమియాతో పాటు, కోకోనట్ జ్యూస్ వంటి వాటిని తాగేందుకు జనం క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో కొబ్బరి బొండాల ధరలు ఆకాశాన్నంటాయి. ఒక్క బొండం ధర రూ.30కి విక్రయించగా, కొబ్బరి నీరు లీటరు రూ.140కు అమ్ముతున్నారు. వీటితో పాటు వివిధ రకాల కూల్‌డ్రింకులు, సోడాలు, బటర్ మిల్క్, లస్సీ, ఫ్రూట్ జ్యూస్‌ల ధరలూ గణనీయంగా పెరిగాయి.



ఉపశమనం కోసం కొబ్బరి బొండం తాగుతున్న ఓ వ్యక్తి



ఎండ వేడిని తట్టుకోలేక జ్యూస్ తాగేందుకు వచ్చిన మహిళలు, పిల్లలు



చెట్టు నీడలో సేద తీరుతున్న ఓ కార్మికుడు

వర్షాల కోసం ఎదురుచూపు

జూన్ మాసం ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో.. ఎండ తీవ్రతకు తల్లడిల్లుతున్న జనం నైరుతి రుతు పవనాల కోసం ఎదురు చూస్తున్నారు. రుతు పవనాల రాకతో వర్షాలు కురిసి, వాతావరణం కాస్త చల్లబడుతుందని గంపెడాశతో ఉన్నారు.

వ్యాపారం బాగుంది



సమ్మర్ సీజన్‌లో వివిధ రకాల కూల్‌డ్రింకులు, సోడాలు, బటర్ మిల్క్ వంటి శీతల పానీయాల వ్యాపారం బాగా ఉంటుంది. గతంతో పోలిస్తే ఇప్పుడు కూల్ డ్రింకుల వ్యాపారం ఆశించిన స్థాయిలో లేదు. ప్రస్తుతం ప్యూర్ కోకోనట్ వాటర్, ప్యూర్ జ్యూస్‌ల పేరుతో లీటర్, అర లీటర్ సీసాలు మార్కెట్‌లోకి వచ్చాయి. ముఖ్యంగా కొబ్బరి నీళ్లు, చెరుకు రసం వంటి న్యాచురల్ డ్రింక్స్‌కు జనం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. సీజన్ పరంగా పోలిస్తే వేసవి కాలంలో శీతల పానీయాల అమ్మకాలకు మంచి డిమాండ్ ఉంది.

– ఎ.వెంకటరమణ, వ్యాపారి

ఎండ వేడి అధికంగా ఉంది



ఉదయం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. వేడి గాడ్పులతో పాటు, ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో బయటకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నాం. రోజువారీ కార్యకలాపాలకూ ఆటంకాలు ఎదురవుతున్నాయి.

– ఎం.దుర్గారావు, స్థానికుడు

మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరం

కంబాలచెరువు: మైనర్లకు మోటార్ వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మైనర్లు, వారి తల్లిదండ్రులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మూడు రోజులుగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు రోజులుగా మొత్తం 30 మంది మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నామన్నారు. వారు, వారి తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలకు కౌన్సెలింగ్ నిర్వహించి, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించామన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేనివారికి వాహనాన్ని ఇవ్వరాదని పెద్దలకు వివరించామన్నారు. మైనర్ల నుంచి పట్టుకున్న ద్విచక్ర వాహనాలకు రూ.16 వేలు ఈ–చలాన్ రూపంలో జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో టూ టౌన్ సీఐ వి.శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజులోవ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలి



రాజులోవ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రకాశం నగర్: ప్రజా ఉద్యమాల్లో రాజులోవ చూపిన స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక విక్రమ హాల్‌లో రాజులోవ సంస్మరణ సభ జరిగింది. తొలుత రాజులోవ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సభకు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ అధ్యక్షత వహించగా, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో రాజులోవ రెండు దశాబ్దాలుగా కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అటువంటి చురుకైన కార్యకర్తను కోల్పోవటం ప్రజా ఉద్యమానికి తీరని లోటని అన్నారు. రాజులోవ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాజులోవ సేవలను కొనియాడారు. ప్రజానాట్య మండలి కళాకారులు రాజులోవను స్మరిస్తూ ఆలపించిన గీతాలతో కార్యకర్తల కళ్లు చెమర్చాయి. కార్యక్రమంలో సంఘ జాతీయ ఉపాధ్యక్షురాలు బేబీరాణి, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.మధు, కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైలకు ఎస్పీ ఆత్మీయ వీడ్కోలు



పదవీ విరమణ చేసిన ఎస్సై ఝూన్సీని సత్కరిస్తున్న ఎస్పీ పి.జగదీష్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఎస్సైలను జిల్లా ఎస్పీ పి.జగదీష్ శుక్రవారం సత్కరించారు. వారిని సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఎస్సై జి.ఝాన్సీ, ఏఆర్ ఎస్సై పి.ప్రభుప్రసాద్‌కు ఎస్పీ జగదీష్ జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖకు వీరు చేసిన సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. వారి భావి జీవితంలో ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.అనిల్‌కుమార్, ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఎల్.చెంచి రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.రఘురాం, ఉపాధ్యక్షుడు జె.సాయిమహేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామారావు సేవలు అభినందనీయం

కలెక్టర్ మాధవీలత



రామారావు దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: ఏడాది కాలంగా ఎన్నికల ప్రక్రియ సందర్భంలో పరిపాలనాధికారిగా బీవీఎస్ రామారావు కీలక బాధ్యతలు నిర్వహించారని జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరిపాలనాధికారి రామారావు పదవీ విరమణ సత్కార సభకు ముఖ్యఅతిథులుగా కలెక్టర్‌తో పాటు, జేసీ ఎస్.తేజ్‌భరత్ హాజరయ్యారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ఆరోగ్యవంత జీవనం గడుపుతూ పదవీ విరమణ చేయడం అదృష్టమన్నారు. రానున్న రోజుల్లో ఇంకా మంచి ఆరోగ్యంతో ఉండాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. జేసీ ఎస్ తేజ్ భరత్ మాట్లాడుతూ రెవెన్యూ సర్వీసులో ఒత్తిడిని అధిగమించి రామారావు పూర్తి స్థాయిలో సేవలు అందించారన్నారు. కుటుంబ సభ్యులతో గడపడం, చిరకాల స్వప్నం నెరవేర్చడానికి పదవీ విరమణ మంచి అవకాశమన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు మాట్లాడుతూ 1988లో రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో చేరిన రామారావు, తర్వాత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, సీనియర్ అసిస్టెంట్‌గా కాకినాడ రూరల్, కోటనందూరు డిప్యూటీ తహసీల్దార్ సీఎస్‌డీటీగా పనిచేశారన్నారు. 2023లో తహసీల్దార్‌గా పదోన్నతి పొంది, తూర్పు గోదావరి జిల్లాలో పరిపాలనాధికారిగా నియమితులయ్యారన్నారు. నాలుగు తరాలుగా తమ కుటుంబం రెవెన్యూ శాఖలో పనిచేసిందని రామారావు చెప్పారు. ఈ సందర్భంగా రామారావు, మహాలక్ష్మి దంపతులను కలెక్టర్, జేసీ తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్ కృష్ణనాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భానుప్రకాష్, రామారావు కుటుంబ సభ్యులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ధూమపాన నియంత్రణతో సమాజ ఆరోగ్యం



రైల్వే ఉద్యోగులతో ప్రమాణం చేయిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో ధూమపానాన్ని నియంత్రిస్తే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని రాజమహేంద్రవరం రైల్వే హెల్త్ యూనిట్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకుమాంబ అన్నారు. ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినం సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ధూమపానానికి వ్యతిరేకంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధూమపాన నియంత్రణకు రైల్వే ఉద్యోగులతో ప్రమాణం చేయించారు. క్విట్ స్మోకింగ్.. బీ ది కింగ్ అనే నినాదంతో రైల్వే హాస్పటల్, రైల్వే స్టేషన్, ఐదు బళ్ల మార్కెట్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. స్కౌట్ మాస్టర్ హెచ్ఎంఎస్ రాజ్‌పుత్, ఏఆర్ఎస్ఎల్ ఎస్.ఈశ్వర్ ప్రతాప్, ఎ.ఆదిత్య, అసిస్టెంట్ రేంజర్ లీడర్ ఎస్ ఐంద్రీ, స్కౌట్స్, గైడ్స్, రోవర్లు, రేంజర్లు, రైల్వే హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

రంగంపేట: విజ్ఞాన సముపార్జన పుస్తక పఠనంతో సాధ్యమవుతుందని గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగింది. ముందుగా విద్యార్థులు సరస్వతీ పూజ చేశారు. అనంతరం విద్యార్థులకు నీతి కథలు బోధించారు. శారీరక దృఢత్వానికి యోగా అవసరం అన్నారు. విజ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనమే ఆధారమని, నిత్యం గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలని సూచించారు. రిటైర్డ్ ఇరిగేషన్ ఉద్యోగి పీవీ ప్రసాద్ పాల్గొని విద్యార్థులకు తెలుగు శతక పద్యాలు వివరించారు. జనరల్ నాలెడ్జ్‌పై శిక్షణ ఇచ్చారు.

వాటర్ ప్లాంట్ సీజ్

కంబాలచెరువు: నాణ్యత ప్రమాణాలు పాటించని వాటర్ ప్లాంట్ల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్.సుబ్బారావు హెచ్చరించారు. విజిలెన్స్, రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు నగరంలోని రెండు వాటర్ ప్లాంట్లను శుక్రవారం తనిఖీ చేశారు. నిర్వాహకుడైన గోలి రాంబాబు వాటర్ ప్లాంట్‌లో తాగు నీటి పరీక్షకు ల్యాబ్‌ను, టెక్నీషియన్‌ను నిర్వహించడం లేదని గుర్తించారు. లూజ్ వాటర్‌ను 20 లీటర్ల టిన్నుల్లో నింపి వినియోగదారులకు అమ్ముతున్నాడని, ఇసుక ఫిల్టర్, కార్బన్ ఫిల్టర్, మైక్రాన్ ఫిల్టర్లు, రా వాటర్ సంప్‌లను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం లేదని వివరించారు. నిబంధనల ప్రకారం నిర్వహణ లేకపోవడంతో వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేశామన్నారు. అలాగే గంగా శ్రీ ప్యూరిఫైడ్ వాటర్‌ను తనిఖీ చేయగా, జీఎస్టీ రిజిస్ట్రేషన్, రికార్డులు నిర్వహించడం లేదని గుర్తించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు శ్రీనివాసరెడ్డి, జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ, భార్గవ మహేష్, కానిస్టేబుళ్లు వలీ, కిషోర్ పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

డీవైఈఓ నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈఓ నారాయణ

సీతానగరం: మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని మిడ్‌డే మీల్స్ ఇంప్లిమెంట్ ఏజెన్సీల వారికి డీవైఈఓ ఈ.నారాయణ ఆదేశించారు. శుక్రవారం సీతానగరం మండల రీసోర్స్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. పాఠ్య పుస్తకాలు ఎన్ని వచ్చాయని ఆరాతీశారు. అనంతరం ప్రభుత్వ హైస్కూల్‌లో మండలంలోని మిడ్‌డే మీల్స్ ఇంప్లిమెంట్ ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వంటలు చేసే సమయంలో శుభ్రతను పాటించాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెను ప్రకారం ఆహారం అందించాలన్నారు. నాణ్యమైన ఆహారం అందిస్తే, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి, చదువులో ప్రతిభ చూపుతారని చెప్పారు. త్వరలో స్కూళ్లు పునః ప్రారంభమవుతాయని, ఇంప్లిమెంట్ ఏజెన్సీల నిర్వాహకులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీఎం సూపరింటెండెంట్ డి.రామకృష్ణ, ఎంఈఓలు కె.స్వామినాయక్, టి.ముత్యాలు, ఇన్‌చార్జి హెచ్ఎం కస్సూరి సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

రాజానగరం: జీఎస్ఎల్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆస్పత్రిలో శనివారం నుంచి జూలై ఒకటి వరకు నెల రోజుల పాటు ఉచిత వైద్య సేవలు అందించనున్నట్టు ఆస్పత్రి చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. డాక్టర్స్ డే అయిన జూలై ఒకటిన వైద్య కళాశాలను ప్రారంభించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నెల రోజులు అన్ని రకాల చికిత్సలు, మెడికల్ ప్రొసీజర్లు, సర్జరీలు ఉచితంగా చేస్తామన్నారు. వైద్య పరీక్షలు, ఇన్వెస్టిగేషన్లకు సంబంధించిన ఫీజుల్లో మాత్రం 50 శాతం రాయితీ ఉంటుందన్నారు.

సేంద్రియ సాగు... బహు బాగు

- ఈ విధానానికే రైతుల మొగ్గు
- తక్కువ ఖర్చుతో అధిక లాభాలు

పెదపూడి: కాలం మారుతోంది.. సాగులో రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గుతోంది.. ఇది ప్రజల ఆరోగ్యానికి హాని కారకమవుతుంది. ఈ నేపథ్యంలో అంతా సేంద్రియ ఎరువుల వినియోగంపై మొగ్గు చూపుతున్నారు. దీనిని వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. రసాయన ఎరువుల వాడకంతో వచ్చే అనర్థాలను గుర్తించిన పలువురు రైతులు భూసారం పెంపునకు దృష్టి సారించారు. పశువుల పేడ, కోడిపెంట, చీకిన గడ్డితోపాటు చెరువులు, కుంటల్లోని పూడిక మట్టిని పొలాల్లో వేస్తున్నారు. కొంతకాలంగా తరచూ రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోయి పంటలు, పైర్లకు చీడపీడలు సోకి ఉత్పత్తులు తగ్గిపోయి నష్టాలను చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలనిచ్చే సేంద్రియ ఎరువులనే వాడాలని ముందుకు సాగుతున్నారు. పశు సంపద లేని రైతులు, కోళ్లఫారాల్లోని పెంట, చెరువులు, కుంటల్లో పూడిక మట్టిని కొనుగోలు చేసి పొలాల్లో వేస్తున్నారు. దీంతో తక్కువ వ్యయంతో అధికం ప్రయోజనం లభిస్తుంది.

నియోజకవర్గంలో ఇలా..

పెదపూడి, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో సుమారు 47 వేల ఎకరాల్లో సాగు జరుగుతోంది. ఇందులో సుమారు 40 శాతం మంది రైతులు సేంద్రియ ఎరువులు వాడకానికి ప్రయత్నిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఈ విధంగా పొలాలకు మట్టి, పెంటను తరలించుకుంటున్నారు. పంటల దమ్ములకు ముందే సేంద్రియ ఎరువులను పొలాల్లో వేసి కలియ దున్నితే త్వరగా మట్టిలో కలిసిపోయి, మంచి ఫలితాలను ఇస్తాయని పలువురు రైతులు చెబుతున్నారు.



పెదపూడిలో పశువుల పేడ, చెత్త, పెంటను ట్రాక్టర్‌పై పొలానికి తరలింపు

ప్రయోజనాలు ఎక్కువ..

- సేంద్రియ ఎరువులు వాడితే పొలాలకు ప్రయోజనాలు ఎక్కువ ఉంటాయి. వీటి ద్వారా పంటకు కావాల్సిన అన్ని ముఖ్యమైన పోషకాలను అందించవచ్చు.
- భూమిలో నీటిని నిల్వ చేయడానికి సేంద్రియ ఎరువుల ఉపయోగపడతాయి. దీనివల్ల భూమిలో తేమశాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండిపోవు.
- నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నప్పుడు సేంద్రియ ఎరువులు భూమి పొరలలో ఉండే నీటిని మొక్కలకు లభ్యమయ్యేటట్లు చేస్తాయి.
- సేంద్రియ ఎరువులు భౌతిక లక్షణాలను ప్రభావితం చేస్తాయి. ఇసుక నేలల్లో మెత్తని మట్టి శాతాన్ని పెంచడానికి, నీటిని పట్టి ఉంచే శక్తి పెంపొందించడానికి దోహదపడతాయి. ఫలితంగా మొక్కలు పరిస్థితులు తట్టుకుని పెరగడానికి వీలు పడుతుంది.
- వివిధ రకాల రసాయన ఎరువులతో కలిగిన సమస్యలను సేంద్రియ ఎరువుల వాడకంతో పరిష్కరించుకోవచ్చు.
- నేలలో మొక్కలకు మేలు చేసే అనేక రకాల సూక్ష్మజీవులుంటాయి. ఈ సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందడానికి సేంద్రియ ఎరువుల ఆహారంగా ఉపయోగపడతాయి.
- సేంద్రియ ఎరువులు వాడిన పొలాల్లో, చీడపీడలు, తెగుళ్లు తక్కువగా ఉంటాయి. ఈ పొలాల్లో నాణ్యమైన దిగుబడి వస్తుంది.

పంటలకు ఎంతో మేలు



పొలాల్లో సేంద్రియ ఎరువుల వాడకంతో పంట పొలాలకు మేలు జరుగుతుంది. రైతుకు తక్కువ ఖర్చుతో చాలా లాభాలు ఉంటాయి. నాణ్యమైన పంటలు పండుతాయి. భూసారం పెరిగి, చీడపీడలు తగ్గుతాయి. దిగుబడులు ఆశాజనకంగా ఉండి లాభాలు పొందవచ్చు.

–టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయ శాఖ అధికారి, పెదపూడి